నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- కేసీఆర్ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామి
- ప్రజలకు మొండిచెయ్యి చూపిస్తున్న కాంగ్రెస్
- ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

రఘునాథపాలెం, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణబద్ధులై ఉండాలని, పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో వైస్ ఎంపీపీ గుత్తా రవి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గొంతుకను పార్లమెంట్‌లో వినిపించేందుకు, రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు మొండిచెయ్యి చూపిస్తోందని అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 100 రోజుల్లోనే రాష్ట్ర ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 10 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలు ఏనాడూ జిల్లా, రాష్ట్ర ప్రయోజనాలను గుర్తించి మాట్లాడిందిలేదన్నారు. కేంద్రం నల్లచట్టాలు తీసుకొచ్చి మీటర్లు పెట్టాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ కొట్లాడి అడ్డుకుందని గుర్తుచేశారు. జిల్లాలో రూ.8 వేల కోట్ల విలువైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చినట్లు పేర్కొన్నారు.

అజాత శత్రువు ఎంపీ నామా : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు జీవితం తెరిచిన పుస్తకమని, శత్రువులు లేని శాశ్వత మిత్రుడు అని ఖమ్మంజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. నామాను గెలిపించుకుంటే వచ్చే ఐదేళ్లు కార్యకర్తలకు కొండంత అండగా ఉంటారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, నాయకులు తాళ్లూరి జీవన్, మాజీ జడ్పీటీసీ కుర్రా భాస్కర్ రావు, మద్దినేని వెంకటరమణ, మాదంశెట్టి హరి ప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, నున్నా శ్రీనివాసరావు, దొంతు సత్యనారాయణ, గొర్రె శ్రీను, దేశినేని నర్సయ్య, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, తాళ్లూరి హరీశ్, చీకటి రాంబాబు, తాతా వెంకటేశ్వర్లు, భద్రయ్య, సైదులు, సరిపూడి గోపి, భార్గవ్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

ఐజీపీ ఏవీ రంగనాథ్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐజీపీ రంగనాథ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 8 : గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మల్టీజోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ డిస్ట్రిక్ట్, స్టేట్ సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయం, సమాచార మార్పిడితో గంజాయి అక్రమ రవాణా లింక్‌లను బ్రేక్ చేయాలని సూచించారు. దీనికోసం అవసరమైన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా గంజాయి మూలాలను కనిపెట్టి కట్టడి చేయడంతోపాటు వివిధ మార్గాల్లో చేస్తున్న రవాణాపై దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు న్యాయస్థానంలో పడిన శిక్షలను పరిగణనలోకి తీసుకొని దర్యాప్తులో ముందుకెళ్లాలన్నారు. ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో 170 కిలోల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో పకడ్బందీ చార్జ్‌షీట్‌తో నలుగురికి 20ఏండ్ల జైలు శిక్ష, జరిమానా పడేలా చేసిన ఖమ్మం జిల్లా పోలీసులను ఐజీపీ అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, భోజరాజు, మల్లయ్య, సీఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీక్రోధి నామ సంవత్సరం ప్రారంభం

కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం

ఉగాది పచ్చడిలో జీవిత సందేశం

ఖమ్మం/ కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 8 : తెలుగు సంవత్సరానికి తొలి అడుగు.. వినసొంపైన కోయిల రాగం.. పచ్చనిచివుళ్లు తొడిగిన కొమ్మలు.. కొత్త ఆశలతో రైతుల ఏరువాక.. మంచి చెడులను తెలుసుకునే పంచాంగ శ్రవణం.. షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పర్వదినం.. తెలుగు ప్రజల పండుగ ఇది. శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ముగిసి చైత్రబహుళ షష్ఠి మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. తెలుగు సంవత్సరాది ఉగాదిని కుటుంబ సభ్యులంతా ఘనంగా జరుపుకుంటారు. తెల్లవారుజామున అభ్యంగన స్నానం చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. నూతన వస్త్రాలు ధరిస్తారు. ఇళ్లను మామిడి, వేపాకు తోరణాలతో అలంకరిస్తారు. చాలామంది పండుగ నాడు కొత్త పనులు ప్రారంభిస్తారు. నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి తయారుచేస్తారు. పొలాలకు వెళ్లి ఏరువాక ప్రారంభిస్తారు. గోవులను శుభ్రంగా కడిగి బొట్టుపెట్టి అందంగా అలంకరించడం ఆనవాయితీ. ఉగాది పచ్చడిని తయారు చేసి ఈశ్వరుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ప్రసాదంగా స్వీకరిస్తారు.

షడ్రుచుల సమ్మేళనం..

జీవితంలో ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది. తీపి, చేదు, కారం, పులుపు, ఉప్పు, వగరు ఇలా ఆరు రుచులు కలిపి తయారు చేసే పచ్చడి ఎంత రుచిగా ఉంటుందో జీవితంలో కూడా కష్ట నష్టాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ఇలా అన్ని సమపాళ్లలో ఉంటే జీవితం కూడా సుఖమయంగా ఉంటుందనే నానుడి. తొడిమ లేని లేత వేపపూత, కొత్త బెల్లం, పిక్కతో ఉన్న చింతపండు, టెంకపట్టని మామిడి ముక్కలు, కొత్త కారం, రాళ్ల ఉప్పుతో ఉగాది పచ్చడి తయారుచేస్తారు. ఉగాది పచ్చడిలోని ఈ ఆరు పదార్థాల్లోని రుచులను మంచికి, చెడుకు, సంతోషానికి, బాధకు, దుఃఖానికి, సవాళ్లకు సంకేతాలుగా చెబుతుంటారు. ఇవి మనిషికి ఎల్లప్పుడు ఉంటాయి కాబట్టి జీవితాన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు.

ఉగాది పచ్చడిలో ఉండే ఆరోగ్య లక్షణాలు
వేపపువ్వు – రక్తాన్ని శుద్ధి చేస్తుంది
మామిడి – చర్మ సౌందర్యానికి దోహదం
బెల్లం – శరీర వేడిని తగ్గిస్తుంది
ఉప్పు – శక్తినిస్తుంది
చింతపండు – కాలేయ శుద్ధికి ఉపయోగం
మిర్చి – కఫం, వాత రోగాల నివారణ

పంచాంగ శ్రవణం

ఉగాది రోజున అన్ని ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ ఏడాది మొత్తం ఆదాయ వ్యయాలు, పంటలు, వర్షాలు, రాజ పూజ్యం, అవమానం, రాశులు, నక్షత్రాల ఆధారంగా జాతకాలు చెబుతారు. ఇందుకోసం దేవాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం వినడం ద్వారా సర్వ పాపహరణం జరుగుతుందని నమ్మకం.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మనిషి జీవితంలోని కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలన్నింటినీ సమానంగా స్వీకరించాలన్న సందేశం.. ఉగాది పచ్చడి ఇస్తున్నదని వివరించారు. ప్రజలంతా ఈ సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, అభివృద్ధిలో మన జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.





- తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా
- కమ్మరిగూడెంలో మిషన్ భగీరథ పంపుహౌస్ పరిశీలన

చుక్క నీటినీ వృథా కానీయొద్దు

మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా స్పష్టం చేశారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. తాగునీటి సమస్యలు, పరిష్కార చర్యలపై కలెక్టర్ ప్రియాంకతో కలిసి మిషన్ భగీరథ, మున్సిపల్, నీటి పారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కొత్తగూడెం ఐడీవోసీలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రహదారి మార్గం లేని హ్యాబిటేషన్లలో డబ్బాల ద్వారా నీటి సరఫరా చేసే నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన కలెక్టర్ ప్రియాంక అభినందనీయురాలని అన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలపై తీసుకున్న ప్రణాళిక, కార్యాచరణ ప్రశంసనీయమైనదని అన్నారు. అనంతరం కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల్లో పురోగతి లేదని అన్నారు. అన్ని పనులనూ వారంలోగా పూర్తి చేసి సంబంధిత పనుల ఫొటోలను నివేదిక రూపంలో అందజేయాలని సూచించారు. మండల, పంచాయతీ ప్రత్యేక అధికారులు ప్రతి రోజూ తమ పరిధిలోని నీటి సరఫరా కేంద్రాలను తనిఖీ చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియ పరిశీలించి రిజిష్టర్‌లో సంతకం చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఇతర అధికారులు విద్యాచందన, ప్రసూనారాణి, కిష్టాగౌడ్, కృపాకర్, శ్రీనివాస్, సదాశివకుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పంపుహౌస్ పరిశీలన..

అశ్వాపురం, ఏప్రిల్ 8: అశ్వాపురం మండలం కమ్మరిగూడెంలో మిషన్ భగీరథ పంపుహౌస్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ప్రియాంక సోమవారం సందర్శించారు. ఇన్‌టేక్ వెల్, నీటి నిల్వ పనులను పరిశీలించారు. అలాగే అక్కడి గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించి నీటి నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇన్‌టేక్ వెల్ నుంచి ఎంత నీరు సరఫరా జరుగుతుందో, మోటార్ల పనితీరు ఎలా ఉందో అనే విషయాలను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రథంగుట్ట 40 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. కమ్మరిగూడెంలో ఉన్న ఐసోలేటెడ్ హ్యాబిటేషన్ సెంటర్‌లో నీటి సరఫరాను తనిఖీ చేసి అక్కడి గిరిజనులతో తాగునీరు అందుతుందా?లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్‌ను పరిశీలించి రోజుకు ఎన్నిసార్లు ట్యాంకుకు వాటర్ పంపుతున్నారని అధికారులను అడిగారు. 5 వేల లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంనును సోలార్ పంపు ద్వారా రెండు సార్లు నింపుతున్నట్లు అధికారులు సమాధానమిచ్చారు. అయితే సోలార్ పంపు ద్వారా సమస్య తలెత్తినట్లయితే నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశమున్నందున ముందస్తుగా కరెంటు మోటరును అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు

- ఉగాది రోజు నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు
- సర్వం సిద్ధం చేసిన దేవస్థానం అధికారులు

విద్యుత్ కాంతుల్లో భద్రాద్రి రామాలయం

భద్రాచలం, ఏప్రిల్ 8 : ఉగాది రోజున మంగళవారం భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం అంతరాలయంలోని ధ్రువమూర్తుల వద్ద ఉత్సవాలకు అనుజ్ఞ తీసుకొని ధ్వజారోహణం చేయనున్నారు. వేడుకల ప్రారంభానికి ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహవాచన, రుత్విగ్వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, వాస్తు హోమం, ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఉగాది ప్రసాద వితరణ, సాయంత్రం దర్బార్ సేవ తర్వాత నూతన పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. అలాగే కల్పవృక్ష వాహనంపై తాత గుడి సెంటర్ వరకు స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి : దేవస్థానం ఈవో రమాదేవి

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 16 సాయంత్రం నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం, 17న సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేకం నిర్వహించనున్నాం. మిథిలా ప్రాంగణంలో జరిగే వేడుకల కోసం కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి భక్తునికి స్వామివారి తలంబ్రాలు అందేలా ఈసారి 60 తలంబ్రాల కౌంటర్లు, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు కొనుగోలు చేసేందుకు 19 కౌంటర్లను ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యం కోసం 2.50 లక్షల లడ్డూలు, 5 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేశాం. ఆర్టీసీ బస్సుల్లో కూడా స్వామివారి తలంబ్రాలను భక్తులకు అందజేస్తాం. ఆర్టీసీ కార్గో, తపాలా శాఖ ద్వారా కూడా భక్తులకు తలంబ్రాలను ఇంటి వద్దకే అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఈ నెల 17 ఉదయం 6 గంటల వరకు ఒరిజినల్ టికెట్లను అందజేస్తాం. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎదుర్కోలు ఉత్సవానికి రాష్ట్ర మంత్రులు, శ్రీరామ నవమికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తారని, కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషనర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకొచ్చే అవకాశం ఉంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు, ఏప్రిల్ 8: రాష్ట్రంలోని అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. జూలూరుపాడులో కాంగ్రెస్ నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి నివాసంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైరా, భద్రాచలం ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌తో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. నాయకులు బొర్రా రాజశేఖర్, నాగా సీతారాములు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వందనపు సత్యనారాయణ, అల్లడి నర్సింహారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.